క్లుప్తంగా

గ్రామాల్లో ట్రైనీ కలెక్టర్ పర్యటన



వేలేరు : మండలంలో ట్రైనీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా గురువారం పర్యటించారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశాల మేరకు ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. శాలపల్లి నర్సరీ, స్మశానవాటిక, సోడాషపల్లి పల్లెప్రకృతి వనాలను పరిశీలించారు. అన్ని శాఖలపై అవగాహన కల్పించుకునేందుకు ఫీల్డ్‌వర్క్ చేస్తున్నట్లు తెలిపారు. ఆమె వెంట ఎంపీడీఓ లక్ష్మీ ప్రసన్న, ఎంపీఓ విమల తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు



దామెర : మండలంలోని ఊరుగొండ గ్రామంలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం. ఊరుగొండ గ్రామానికి చెందిన దేవులపల్లి సాంబయ్య రోడ్డు దాటుతుండగా ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి కాన్వాయ్ ఢీ కొట్టింది. దీంతో అతని తలకు, కాళ్లకు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ప్రమాదంపై పోలీసులను వివరణ కోరగా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఎరుకల సంఘం ఎన్నిక



ఐనవోలు: మండల కేంద్రానికి చెందిన పల్లకొండ రమేష్, పి రమేష్ ఎరుకల సంఘం ఐనవోలు గ్రామ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలో సమావేశమైన ఆ సంఘం ప్రతినిధులు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారిని స్థానిక నాయకులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పల్లకొండ సురేష్, సమ్మయ్య, కొమురయ్య, రాజేష్, భిక్షపతి, పెద్ద సమ్మయ్య, రమేష్ పాల్గొన్నారు.

నియామకం



కమలాపూర్: తెలంగాణ బీసీ సంఘం హుజూరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన సల్ల నిరంజన్‌ను నియమించినట్లు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య, రాష్ట్ర అధ్యక్షుడు టీఆర్ చందర్ గురువారం ప్రకటనలో వెల్లడించారు. మహాత్మా జ్యోతిరావు పూలేను ఆదర్శంగా తీసుకుని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



శాయంపేట : ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి అత్తమ్మ రోండ్ల విజయమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఆ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రం అశోక్, మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వంగాల నారాయణరెడ్డిలు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

కుటుంబంపై దాడి

నడికూడ: అన్నదమ్ముల మధ్య వైరం పెరిగి గొడవకు దారి తీసింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ముస్త్యాలపల్లి గ్రామానికి చెందిన బండెల స్వామి, విష్ణు, రాములు ముగ్గురు అన్నదమ్ములు. బండెల రాములు తనకున్న 2 ఎకరాల వ్యవసాయ భూమిలో గురువారం పంటకు నీరు పట్టే క్రమంలో స్వామి, విష్ణు కారంపొడి చల్లి దాడికి యత్నించారు. దీంతో రాములు భయంతో ఇంటికి పరుగులు తీశాడు. అయినా స్వామి, విష్ణు ఇంటి వద్దకు చేరుకొని రాముల భార్య, ఇద్దరు పిల్లలపై దాడి చేసి గాయపర్చారు. బాధితులు డయల్ 100 సమాచారం ఇవ్వగా ఎస్సై రమేష్ సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను చికిత్స నిమిత్తం తన వాహనంలో ఆస్పత్రికి తరలించారు. కాగా ఉమ్మడి వ్యవసాయ బావి విషయంలో వివాదం తలెత్తినట్లు సమాచారం. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సింహగర్జన యాత్రకు మద్దతు

శాయంపేట : విశ్వకర్మల హక్కుల సాధనకై హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న సింహగర్జన సభకు గురువారం మండలంలోని విశ్వబ్రాహ్మణులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. వీరికి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి, నాయకులు మద్దతు తెలిపారు.

ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలి

- ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్
- గ్రామాల్లో పోలీసుల కవాతు



శాయంపేట: మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రోగ్రాంలో మాట్లాడుతున్న డీసీపీ రవీందర్

శాయంపేట : అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వచ్ఛందంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ అన్నారు. మండలంలోని పెద్దకోడెపాకలో గురువారం మోడల్‌కోడ్‌ఆఫ్‌కండక్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ రవీందర్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. గ్రామాల్లో ఎలాంటి గొడవలు జరగకుండా ప్రజలు సంయవనం పాటించాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో నేరాలకు పాల్పడినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం, డబ్బులు పంపిణీ చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే ఎలక్షన్ కమిషన్ ఏర్పాటు చేసిన 1950కు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ కిషోర్‌కుమార్, సీఐ మల్లేష్, ఎస్సై దేవేందర్ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు

ఎల్కతుర్తి: మండలంలోని ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటుహక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని ఎస్సైలు గోదారి రాజ్‌కుమార్, సాయిబాబు అన్నారు. గురువారం ఎల్కతుర్తి మండల కేంద్రంతో పాటు భీమదేవరపల్లిలో కేంద్ర బలగాలతో స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్‌శాఖ కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తోందన్నారు. గ్రామాల్లో అర్హులందరూ ఓటుహక్కు వినియోగించుకునేలా కవాతు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వచ్ఛందంగా ఓటు వేయాలని కోరారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలని అన్నారు.



వేలేరు : కవాతు చేపట్టిన కేంద్ర బలగాలు



ఎల్కతుర్తిలో పోలీసుల కవాతు

వేలేరులో..

వేలేరు : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంతో పాటు సోడాషపల్లి, మల్లికుదుర్ల గ్రామాల్లో గురువారం ఎస్సై హరిత ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రతిఒక్కరూ సహకరించాలని అన్నారు. అర్హులందరూ తమ ఓటుహక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల్లో చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రమణారెడ్డి



కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు

శాయంపేట : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన యాదవ, ముదిరాజ్, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన 150 మంది గురువారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే రమణారెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, సర్పంచ్ ప్రసాద్, ఎంపీటీసీ విజయ్‌కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, ఉపసర్పంచ్ సుమన్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

మండల కేంద్రానికి చెందిన బీజేపీ చేనేత కార్మిక విభాగం జిల్లా కన్వీనర్ మామిడి సుదర్శన్, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ బాసాని చంద్రమౌళి గురువారం టీపీసీసీ సభ్యుడు, భూపాలపల్లి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావు సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సత్యనారాయణరావు కండువా కప్పి ఆహ్వానించారు. నాయకులు చిందం రవి, చింతల రవిపాల్, రాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచార రథానికి ప్రత్యేక పూజలు



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్

ఐనవోలు: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఎమ్మెల్యే అరూరి రమేష్ ప్రచార రథానికి గురువారం డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీఆర్‌ఎస్ పార్టీ వర్ధన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేష్ ఐనవోలు మండలంలో ఈ రథంలోనే ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు మునిగాల సంపత్‌కుమార్, సర్పంచ్ జన్ను కుమారస్వామి, కోఆప్షన్ సభ్యుడు గుంశావలి, ఎంపీటీసీ కల్పన, ఉప సర్పంచ్ సతీష్, గ్రామ అధ్యక్షుడు పరమేష్, జైపాల్, మధుకర్ పాల్గొన్నారు.

పదేళ్లలో ఒక్క ఇల్లూ ఇవ్వని బీఆర్‌ఎస్

- కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌గౌడ్

ఎల్కతుర్తి: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లలో ఒక్క డబుల్ బెడ్రూమ్ కూడా కట్టివ్వలేదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే.. ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తామని హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని గుంటూర్‌పల్లి, తిమ్మాపూర్, కేశవాపూర్, ఆరేపల్లి, బావుపేట గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. హుస్నాబాద్ గడ్డపై పొన్నంను గెలిపిస్తే హుస్నాబాద్ గడ్డకు గౌరవప్రదమైన పేరు తీసుకొస్తానని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, నాయకులు సుకినె సంతాజీ, ముప్పు మహేందర్, దాట్ల రాముడు, గొలిపెల్లి సంపత్, శనిగరం వెంకటేష్, బొల్లెపోగు రమేశ్‌బాబు, పాక రమేశ్, మంద సుమన్‌గౌడ్, నరేశ్, శీలం అనిల్‌కుమార్, స్వరూప, సుష్మ తదితరులు పాల్గొన్నారు.



తిమ్మాపూర్ ప్రచారంలో మాట్లాడుతున్న పొన్నం

మెట్ట ప్రాంతం బీఆర్‌ఎస్‌తోనే సస్యశ్యామలం

- ఎమ్మెల్యే అభ్యర్థి వొడితెల సతీశ్‌కుమార్

ఎల్కతుర్తి: హుస్నాబాద్ నియోజకవర్గం పూర్తిగా మెట్ట ప్రాంతమని, ఈప్రాంతమంతా సస్యశ్యామలం కావాలంటే.. బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. గురువారం భీమదేవరపల్లి మండలం కొప్పూరు, మాణిక్యాపూర్, గాంధీనగర్, రత్నగిరి, రంగయ్యపల్లి, వంగర గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఇప్పటికే రూ.26.36 కోట్ల అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దని, వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదించాలని, భారీ మెజార్టీతో తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల ఇన్‌చార్జ్ మాజీ మంత్రి ఇనుగాల పెద్దన్న (పెద్దిరెడ్డి), జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్, ఎంపీపీ జక్కుల అనితరమేశ్, జెడ్పీటీసీ వంగ రవి, పార్టీ మండల అధ్యక్షుడు మారుపాటి మహేందర్‌రెడ్డితో పాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీలు, పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



కొప్పూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 3న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. వడ్డెపల్లి, విజయపాల్ రెడ్డి కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

దీపికరాజ్‌కు డాక్టరేట్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో బాటనీ విభాగం పరిశోధకురాలు కర్పాన్ దీపికరాజ్‌కు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఫ్లూయోరెసెంట్ ఇన్ సిటు హైబ్రిడైజేషన్ (ఫిష్) బేస్డ్ క్రోమోసమ్ మ్యాపింగ్ ఆఫ్ ఫంగసీ ట్రెయిట్ ఇన్ చిల్లీ పెప్పర్ (క్యాప్సికమ్ స్పెసీస్) అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి కర్పాన్ దీపికరాజ్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. బాటనీ విభాగం రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ క్రిస్టోఫర్ రుబెన్ పర్యవేక్షణలో దీపికరాజ్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

సల్ల రఘుకు ఓయూ డాక్టరేట్

కాజీపేట రూరల్: కాజీపేట దర్గా ప్రాంతానికి చెందిన సల్ల రఘుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో ఏ కన్వల్యూషన్ న్యూరల్ నెట్వర్క్ మోడల్ ఫర్ ఆటో మెటిక్ సెగ్మెంటేషన్ ఆఫ్ బ్రెయిన్ ఎమ్మారై ఇమేజెస్ అనే అంశంపై వాసవి కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ టీ.ఆదిలక్ష్మి పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ అందుకున్నారు.

అలరించిన దివ్యాంగులు

కాజీపేట: ఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులైన నిరుద్యోగ కళాకారులు గురువారం సాయంత్రం కాజీపేట చౌరస్తాలో పాటలు పాడుతూ బాటసారులను ఉత్తేజపరిచారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన దివ్యాంగులు శ్రీ సాయి ఆర్గనైజేషన్ పర్యవేక్షణలో ఆర్కెస్ట్రా బృందాన్ని ఏర్పాటు చేసి భక్తి పాటలు, జానపద గేయాలు, సినిమా పాటలను పాడుతూ మైమరిపించారు.

బీఆర్‌ఎస్ మేనిఫెస్టో ప్రజలకు చేరవేయాలి

- ఎమ్మెల్యే అరూరి రమేశ్
- ఐనవోలులో విస్తృతస్థాయి సమావేశం

ఐనవోలు: భారత రాష్ట్ర సమితి మేనిఫెస్టోను ప్రజలకు చేరవేస్తే వర్ధన్నపేట నియోజకవర్గంలో లక్ష ఓట్ల మెజార్టీ సాధ్యమని బీఆర్‌ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ స్పష్టం చేశారు. గురువారం మండల కేంద్రంలోని మల్లికార్జునస్వామి ఫంక్షన్ హాల్‌లో బీఆర్‌ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అరూరి బీఆర్‌ఎస్ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ప్రతీ ఓటరు దగ్గరకు వెళ్లి పదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించాలన్నారు. మూడోసారి గెలిచిన వెంటనే చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు, అందజేయనున్నట్లు పథకాలను క్షేత్రస్థాయిలో వివరించాలని కార్యకర్తలకు సూచించారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను ఇంటింటికి చేరవేసి అందులోని పథకాలను చదివి వినిపించి వారికి అర్థమయ్యే విధంగా చెప్పాలని అన్నారు. కార్యకర్తలు, నాయకులు సమన్వయంగా ముందుకెళ్లాలని అన్నారు. ఒకరి సూచనలు మరొకరు తీసుకోవాలన్నారు. అనంతరం ఒంటిమామిడిపల్లి, కక్కిరాలపల్లి గ్రామాలకు చెందిన పలువురు నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. అదే విధంగా ఉదయం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొండపర్తి గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. పోలెపల్లి శంకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఎంపీపీ మార్నేని మధుమతి, పార్టీ మండల కార్యదర్శి బుర్ర రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరూరి రమేశ్

కనులపండువగా సత్యనారాయణ వ్రతం



వ్రతం జరుపుతున్న అర్చకులు

శాయంపేట : మండల కేంద్రంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతం కనుల పండువగా జరిగింది. అర్చకుడు మార్త రాజకుమార్ వేదమంత్రోచ్ఛారణల మధ్య వ్రతాన్ని నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాసాని సూర్యప్రకాష్, భక్తులు ఆదిరెడ్డి, చంద్రమౌళి మహిళలు పాల్గొన్నారు.

లక్ష ఓట్ల మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలుస్తా

- పరకాల బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి



నడికూడ : ఓట్లను అభ్యర్థిస్తున్న ధర్మారెడ్డి

నడికూడ: ప్రజల ఆశీర్వాదంతో లక్ష ఓట్ల మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలుస్తానని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని వెంకటేశ్వరపల్లిలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. నార్లపూర్, చర్లపల్లి గ్రామాల్లో పర్యటించి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం అన్నారు. మేనిఫెస్టోలో ఉన్న హామీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు రాష్ట్రంలోని ప్రతి గడపకు అందాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న కర్ణాటక రాష్ట్రంలో 24 గంటలు కరెంట్ ఎందుకు ఇవ్వడం లేదో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుట్రలు చేసినా మూడోసారి బీఆర్‌ఎస్ పార్టీనే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల అభిమానాన్ని చూస్తే తన గెలుపు ఖాయమై విజయయోత్సవ ర్యాలీగా కనిపిస్తుందని అన్నారు. ఎంపీపీ అనసూర్య, జెడ్పీటీసీ కోడెపాక సుమలత, వైస్ ఎంపీపీ చంద కుమారస్వామి, మండల అధ్యక్షుడు దురిశెట్టి చంద్రమౌళి, గణపతిరెడ్డి, గొల్కొండ సదానందం, అనిల్, జయపాల్ రెడ్డి, రఘుపతి, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరకాల: బీఆర్‌ఎస్ అధికారంలో ఉంటేనే రాష్ట్రంలోని నిరుపేదలకు బంగారు భవిష్యత్ ఉంటుందని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రాత్రి పరకాల మండలం పోచారం, అలియాబాద్, కామారెడ్డిపల్లి గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యకర్తలు డప్పుచప్పుళ్ల మధ్య బోనాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడారు. 24గంటల విద్యుత్ కావాలంటే ప్రజలు మళ్లీ బీఆర్‌ఎస్‌ను గెలిపించుకోవాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ దూకుడుతో బీఆర్‌ఎస్ డీలా

- హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రణవ్

కమలాపూర్: కాంగ్రెస్ పార్టీ దూకుడు చూసి బీఆర్‌ఎస్ పార్టీ డీలా పడిందని హుజూరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితల ప్రణవ్ అన్నారు. మండల కేంద్రంతో పాటు ఉప్పల్, శనిగరం, శ్రీరాములపల్లి, గూడూరు, నేరెళ్ల, వంగపల్లి, పంగిడిపల్లి, శంభునిపల్లి గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు సుమారు 300 మంది గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికి ప్రణవ్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని కోరారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీనే అని, ప్రతీ గడపకు న్యాయం చేస్తామని అన్నారు. ఆరు గ్యారంటీలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. పార్టీలో చేరిన వారిలో బీఆర్‌ఎస్ శనిగరం గ్రామ శాఖ అధ్యక్షుడు కొత్తపెల్లి రాజు, కమలాపూర్ పట్టణ అధ్యక్షురాలు ఆడెపు విజయ, రజిత, బీఆర్‌ఎస్, బీజేపీ కార్యకర్తలు ఉన్నారు. కాంగ్రెస్ హుజూరాబాద్ ఎన్నికల ఇన్‌చార్జ్ మధుయాదవ్, చరణ్‌పటేల్, నాయకులు కృష్ణారెడ్డి, రాహుల్, రవీందర్, అయిలయ్య, రమేష్‌గౌడ్, భిక్షపతి, విష్ణుదాసు వంశీధర్‌రావు, ప్రసాద్, కృష్ణమూర్తి, కనుకరత్నం, సురేందర్, సునీత పాల్గొన్నారు.



కండువా కప్పి ఆహ్వానిస్తున్న వొడితల ప్రణవ్

‘పగడాల’కు టికెట్.. బీజేపీ శ్రేణుల సంబురాలు



పరకాల: బాణసంచా పేల్చుతున్న నాయకులు

పరకాల: భారతీయ జనతా పార్టీ పరకాల ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ పగడాల కాళీప్రసాద్‌రావు పేరు ఖరారు కావడంతో పట్టణంలో ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు గురువారం నిర్వహించారు. బాణసంచా పేల్చి నినాదాలు చేశారు. పట్టణ అధ్యక్షుడు భిక్షపతి మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని బహుజనులంతా బీసీ బిడ్డ, బీజేపీ అభ్యర్థి డాక్టర్ కాళీప్రసాద్‌రావును గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. బీజేపీ అధిష్టానం బీసీ అభ్యర్థినే సీఎం చేస్తామని చెప్పడం, పరకాల అభ్యర్థిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన కాళీప్రసాద్‌కు ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శులు గాజుల నిరంజన్, కుక్కల విజయ్, ఉపాధ్యక్షుడు మిడిదొడ్డి నరేష్, కిసాన్ మోర్చా పరకాల అధ్యక్షుడు ఆకుల రాంబాబు, వెంకటస్వామి, వీరస్వామి, ముత్యాల దేవేందర్ పాల్గొన్నారు.

కేసీఆర్ అబద్ధపు హామీలను నమ్మొద్దు

ధర్మసాగర్: సీఎం కేసీఆర్ అబద్ధపు హామీలను ప్రజలు నమ్మొద్దని స్టేషన్‌ఘన్‌పూర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుండె విజయరామారావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించి మాట్లాడారు. అధికారంలోకి వచ్చేందుకు సీఎం కేసీఆర్ సభల్లో నోటికి వచ్చిన అబద్ధపు హామీలు ఇస్తున్నారని ఆరోపించారు. సీఎం కుర్చీ కోసం కల్వకుంట్ల కుటుంబం నోటికి వచ్చింది చెబుతూ ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి దళితుడే అని మొదలు పెట్టిన అబద్ధపు మాటలు నేటికి కొనసాగిస్తునే ఉన్నారని విమర్శించారు. తాను నిజాయితీగా పనిచేస్తానని, నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తానని ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు ఎత్తుకు తగిన బరువు ఉండాలి



నడికూడ : అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల బరువు పరిశీలిస్తున్న టీచర్ సంపూర్ణ

నడికూడ: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం 2లో స్పెషల్ డ్రైవ్ ఆన్‌గ్రోత్ మానటరింగ్ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్ సంపూర్ణ స్టాడియో మీటర్ ద్వారా పిల్లల ఎత్తు, బరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొలమానం ద్వారా పిల్లల ఎదుగుతల గురించి తెలుసుకుని కావాల్సిన పోషకాహారాన్ని అందించి పోషణ లోపాన్ని ముందే గుర్తిస్తున్నట్లు తెలిపారు. పిల్లల ఎదుగుదలపై తల్లిదండ్రులకు సూచనలు చేశారు. పౌష్టికాహారంతో కలిగే ప్రయోజనాలను గర్భిణులు, బాలింతలకు వివరించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. బాలింతలు, గర్భిణులు ఆరోగ్యంపై దృష్టి సారించాలని, ఎలాంటి ఆరోగ్య సమస్య వచ్చిన అంగన్‌వాడీ కేంద్రంలో లేదా ఏఎన్‌ఎంలకు సమాచారం అందించాలని కోరారు. శీతాకాలం దృష్ట్యా ప్రజలు పలు సూచనలు పాటించాలని అన్నారు. చిన్నారులను చలిలో ఉంచకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. చర్మం పగులకుండా వైద్యుల సూచనలు పాటించాలని అన్నారు. ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.